నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 శుక్రవారం 26 ఏప్రిల్ 2024
MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

# కేసీఆర్ రోడ్ షోను సక్సెస్ చేయండి

**నాయకులు, కార్యకర్తల సమావేశంలో సుమన్**

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 25 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 4వ తేదీన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మంచిర్యాల పట్టణంలో నిర్వహించనున్న రోడ్ షోను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు చెన్నూరు మాజీ శాసనసభ్యుడు, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ కోరారు. గురువారం తన స్వగృహంలో మందమర్రి మున్సిపాలిటీ, మందమర్రి మండలం, జైపూర్ మండలం, క్యాతనపల్లి మున్సిపాలిటీల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 13వ తేదీన జరగనున్న పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన విధివిధానాలు, మే 4వ తేదీన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మంచిర్యాల పర్యటన సందర్భంగా నిర్వహించనున్న రోడ్ షోను విజయవంతం చేయుటకు నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రానున్న ఎన్నికల్లో పెద్దపల్లి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలనే తలంపుతో నాయకులు, ప్రజాప్రతినిధులు అంతా సమన్వయంతో పని చేసేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మండల జడ్పీటీసీ వేల్పుల రవి, క్యాతనపల్లి మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్‌గౌడ్, సీనియర్ నాయకుడు రాజారమేశ్‌బాబు, రవీందర్, మేడిపల్లి సంపత్, కొంగల తిరుపతిరెడ్డి, బడికల సంపత్‌కుమార్, అబ్బాస్, జాడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

## కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి పునాదులు


పెంచికల్‌పేట్, ఏప్రిల్ 25 : కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి పునాదు అని, యువతతోనే పార్టీ ప్రతిష్ట చేకూరుతుందని ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ, సిర్పూర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి దండె విఠల్ అన్నారు. గురువారం కాగజ్‌నగర్‌లోని తన నివాసంలో చెడ్వాయి గ్రామానికి చెందిన 20 మంది యువకులకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు యువత ముందుండి సైనికుల్లా పనిచేయాలన్నారు. త్వరలోనే మండల కేంద్రంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు బిట్టు శ్రీనివాస్, నూతనంగా పార్టీలో చేరిన యువకులు నానాజీ, బండు, గజేంద్, రాజబాబు, సందీప్, రవి, రాజు, నిఖిల్, కృష్ణ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులతో ఎమ్మెల్సీ దండె విఠల్

## కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి..

మంచిర్యాల టౌన్, ఏప్రిల్ 25 : మే 13వ తేదీన జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం మంచిర్యాల పట్టణంలోని 22వ వార్డు పద్మశాలికాలనీ, మేదరివాడ, లేబర్‌కాలనీ ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల గురించి ఆలోచించాలని, వారితో కొప్పుల ఈశ్వర్‌ను పోల్చుకుంటే ఎంతో తేడా ఉంటుందన్నారు. ఈ ప్రాంత వ్యక్తిగా, ఇక్కడి సమస్యలు తెలిసిన వ్యక్తిగా, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తిగా, కార్మిక నాయకునిగా, సౌమ్యుడిగా పేరున్న కొప్పుల ఈశ్వర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, నాయకులు ఎర్రం తిరుపతి, గరిగంటి కొమురయ్య, కర్రు శంకర్ పాల్గొన్నారు.



మంచిర్యాలలోని పద్మశాలికాలనీలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

## సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై పరిశీలన

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 25 : ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్ గురువారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్ దోత్రే, ఎస్పీ సురేశ్, అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్ చాంబర్‌లో సమావేశమై సాధారణ ఎన్నికల పరిశీలకుడు మాట్లాడారు. ఏమైనా సందేహాలు, ఫిర్యాదులు ఉంటే 8523876384 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఆదిలాబాద్‌లోని పెన్‌గంగ అతిథి గృహంలో మధ్యాహ్నం 3నుంచి 4గంటల వరకు నేరుగా కలువవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పీటీసీ గురుకులంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ దాసరి వేణు, తహసీల్దార్ దేశ్‌పాండే, ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సాధారణ ఎన్నికల పరిశీలకుడు రాజేంద్రవిజయ్

## రెచ్చగొట్టే పోస్టులు పెడితే జైలుకే..

**- రామగుండం సీపీ శ్రీనివాస్**

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 25 : సామాజిక మాధ్యమాల్లో చట్టవ్యతిరేక పోస్టులు పెట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్‌ను పోలీసు అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇతర సోషల్ మీడియా వేదికగా కొందరు వివిధ రాజకీయ నేతలను టార్గెట్‌గా చేసుకుని, ఓ మతాన్ని లేదా మతానికి సంబంధించిన ప్రముఖుల్ని టార్గెట్‌గా చేసుకుని పోస్టులు పెడుతున్నారన్నారు. ఓ వర్గాన్ని కించపరుస్తూ పోస్ట్ చేసినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రీతిలో పుకార్లు ప్రచారం చేసినా జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. సోషల్ మీడియా పోస్టులపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, సీఐ ముత్తి లింగయ్య, ఎస్ఐ రాజమణి పాల్గొన్నారు.



సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సీపీ శ్రీనివాస్

# ఎక్కడి ధాన్యం అక్కడే..

● చాలా చోట్ల ప్రారంభంకాని కేంద్రాలు ● ప్రైవేటుకు అమ్ముకుంటున్న రైతులు ● ఉమ్మడి ఆదిలాబాద్‌లో 508 సెంటర్లకు 215 కేంద్రాల్లోనే కొనుగోళ్లు

కుప్పలు కుప్పలుగా ధాన్యపురాశులు



భీమారం మండలం ధర్మారంలో 18 రోజులుగా పోసి ఉన్న వడ్లు

మంచిర్యాల, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా పలు చోట్ల ధాన్యం కొనుగోళ్లు మొదలు కాలేదు. రైతులు వడ్లను కల్లాలకు తెచ్చి 20 రోజులు అవుతున్నా కొనుగోళ్లు జరగడం లేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వడ్లను ప్రైవేటు దళారులకు విక్రయిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 508 ధాన్యం కొనుగోలు సెంటర్లకు 215 సెంటర్లలోనే ఇప్పుడు ధాన్యం కొంటున్నారు. మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో తప్ప ఆసిఫాబాద్, ఆదిలాబాద్‌లో ఇంకా కేంద్రాలు తెరచుకోలేదు. ఆసిఫాబాద్ జిల్లాలో 35 సెంటర్లకు 15 సెంటర్లను అధికారులు స్టార్ట్ చేశారు. కానీ.. ఇప్పటి వరకు ధాన్యం కొనలేదు. మంచిర్యాల జిల్లాలో 262 సెంటర్లకు 92 కేంద్రాల్లో ధాన్యం కొంటున్నారు. నిర్మల్ జిల్లాలో 208 సెంటర్లకు కడెం, ఖానాపూర్, ముథోల్ ప్రాంతాల్లో 125 సెంటర్లు తెరిచారు. కానీ.. వడ్లు మాత్రం 25 సెంటర్లకే పరిమితమైనట్లు తెలిసింది. ఆదిలాబాద్ జిల్లాలో మూడు సెంటర్లు ఇంకా మొదలు కాలేదు. సాధారణంగా మిగిలిన జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కోతలు కొంచెం ఆలస్యం అవుతాయి. దీంతో ధాన్యం వచ్చాకే సెంటర్లు తెరుస్తామని అధికారులు చెప్తున్నారు. ఇక్కడే అసలు సమస్య వస్తున్నది. రైతులు ధాన్యం తెచ్చి కేంద్రాల దగ్గర పోశాకే అధికారులు కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తుండడంతో ఆలస్యం అవుతున్నది. మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో కొన్ని సెంటర్లలో ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. కాగా.. మంచిర్యాల జిల్లాలో గతంతో పోలిస్తే ఈ సారి కొన్ని సెంటర్లను తీసివేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో సెంటర్ ఉన్న దగ్గర వడ్లు పోసుకుని కొనేవారి కోసం ఎదురు చూస్తున్నారు. కాగా.. చాలా కేంద్రాలకు గన్నీ సంచులు ఇప్పుడిప్పుడే చేరుకుంటున్నాయి.

### బూర్గుపల్లి సెంటర్‌లో కొనుగోళ్లు చేయరా..

మంచిర్యాల జిల్లా భీమారం మండలంలోని బూర్గుపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు చేయక చాలా మంది రైతులు ప్రైవేటు దళారులకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ఈ విషయంలో 'నమస్తే తెలంగాణ'లో ఇటీవల కథనాలు కూడా ప్రచురితమయ్యాయి. ఇప్పటికీ ఈ కేంద్రంలో 300 క్వింటాళ్ల వరకు వడ్లు వచ్చి ఉన్నాయ్. కానీ.. కొనుగోలు మాత్రం చేయడం లేదు. నిర్వాహకులకు అడిగితే రేపు కొంటాం, మాపు కొంటాం అంటూ 15 రోజులుగా దాటవేసుకుంటూ వచ్చారు. చివరకు బుధవారం కొనుగోలు కేంద్రానికి వచ్చిన అధికారులు ధాన్యం నేలపై ఆరబోశారని, వాటిలో తాలు ఎక్కువ ఉందని, అందుకే తూర్పార పట్టాక కొంటామని చెప్పి వెళ్లిపోయినట్లు రైతులు చెప్తున్నారు. ఈ విషయం గడిచిన 15 రోజులుగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెబితే అయిపోయేదని వాపోతున్నారు. ఇప్పటికే మాయిశ్చర్ 16 నుంచి 17 వస్తుందని ఇప్పుడొచ్చి తూర్పార పట్టమంటే ఎక్కడికి పోవాలంటూ బాధపడుతున్నారు. గడిచిన పదిహేను రోజులుగా కొనేవాళ్లు లేక ఇప్పటికే చాలా మంది రైతులు క్వింటాలుకు రూ.1800 నుంచి రూ.2వేల చొప్పున నష్టానికి అమ్ముకున్నారని చెప్తున్నారు. పోయిన సారి ధాన్యం వచ్చిన రెండు, మూడు రోజులకే కొన్నారని, ఇప్పుడు ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కావడం లేదని చెప్తున్నారు. గడిచిన కొన్నేళ్లుగా ఇలా నేలపైనే ధాన్యం పోసి విక్రయిస్తున్నామని, ఈ సారి అలా కుదరని అధికారులు అంటున్నారు. తమ బాధలు ఎవ్వరికీ చెప్పుకోవాలో అర్థం కావడం లేదంటున్నారు. పైగా పేపర్‌లో న్యూస్ వచ్చినందుకు వాయిస్ ఇచ్చిన రైతు వడ్లు కొనమంటూ సెంటర్ నిర్వాహకులు చెప్తున్నట్లు తెలిసింది. మరి ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకుని ఇక్కడ సమస్యను పరిష్కరించాలని రైతులు వేడుకుంటున్నారు.

### ప్రైవేటుకు అమ్ముకున్నాం..



గర్నమెంట్ ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో జాప్యం చేస్తున్నది. తేమ శాతం పేరిట మేము రోడ్లపైనే వడ్లు ఎండపోయాల్సి వస్తున్నది. మరోవైపు అకాల వర్షాలు వస్తుండడంతో ఉన్న ధాన్యం తడిస్తే మొత్తానికే నష్టపోవాల్సి వస్తున్నదని ప్రైవేటు వ్యక్తులకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నాం. ఇక్కడ అధికారులు, నాయకులు ఎవరు పట్టించుకోవడం లేదు. నాకు తెలిసిన రైతులు ఇద్దరు ముగ్గురు ఈ మధ్యే అమ్ముకున్నారు. నేను కూడా బయటే అమ్ముకుందాం అనుకుంటున్నా. తేమ శాతం 30 ఉన్నా కూడా ప్రైవేట్ వాళ్లు తీసుకెళ్లిపోతున్నరు. కిర్గల్(కే)లో ధాన్యం కొనుగోలు సెంటర్ ఉన్నప్పటికీ కొనుగోళ్లు మొదలుకాలేదు. సెంటర్‌కు ఈ రోజే గన్నీ బ్యాగ్‌లు వచ్చాయి. సాయంత్రం నుంచి కొనుగోళ్లు మొదలుపెడతామని చెప్తున్నరు. మరి రేపటిలోపైనా కొనుగోళ్లు స్టార్ట్ చేస్తే బాగుంటుంది.

*- పాణ్యం కోటేశ్వర్‌రావు, బాసర.*

### ధర్మారంలో సెంటర్ పెట్టాలి..



మంచిర్యాల జిల్లా భీమారం మండలం ధర్మారం మాది. పోయిన సారి పక్కనున్న రెడ్డిపల్లికి, మా ఊరికి కలిసి ధర్మారంలో ధాన్యం కొనుగోలు చేశారు. ఈ సారి కూడా కొంటరని పోయినేడు ధాన్యం అమ్మిన కేంద్రం దగ్గరకు తెచ్చి వడ్లు పోసుకున్నాం. నలుగురైదుగురు రైతులు వడ్లు తెచ్చి పోసి 18 రోజులు అవుతుంది. నా ఒక్కవినే 300 క్వింటాళ్లు ఆరబోసుకున్నా. తీరా మా దగ్గర సెంటర్ లేదని చెప్తున్నారు. దాదాపు 20 లారీల నుంచి 30 లారీల ధాన్యం ఈ సెంటర్ నుంచి వస్తది. అందుకే మా ఊరిలో సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. దూరం పోయి అమ్ముకునే పరిస్థితి లేదు. అధికారులు పోయినేడు ఉన్న సెంటర్‌ను తిరిగి ప్రారంభిస్తే బాగుంటది.

*- మేడ మధుసూదన్‌రెడ్డి, ధర్మారం, భీమారం మండలం.*



మంచిర్యాలలోని ఓ మిల్లు వద్ద అన్‌లోడింగ్ కోసం ఉన్న లారీలు



భీమారం మండలం బూర్గుపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న రైతులు

# తగ్గేదేలే..

● రోడ్డు వేస్తేనే ఓటు వేస్తాం.. ● తేల్చి చెప్పిన రాజారం గ్రామస్తులు



అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

కోటపల్లి, ఏప్రిల్ 25 : 'మా సమస్య పరిష్కారం అయ్యే వరకు ఓటు వేసేది లేదు. ఏండ్లు గడుస్తున్నా మమ్మల్ని పట్టించుకునే వారు లేరు. ఇబ్బందులు పడుతున్నా.. మా సమస్యలను తీర్చేవారు లేరు. ఇక ఓపిక పట్టడం మా తరం కాదు. ఓట్ల నాడు రావడం. ఓటు వేశాక వెళ్లడం. ఇదే అవుతుంది. అందుకే పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తున్నాం. ఎవ్వరు వచ్చినా.. ఏమి చేసినా.. ఏం చెప్పిన మా ప్రధాన సమస్య రోడ్డు మార్గం. ఈ సమస్యకు పరిష్కార మార్గం చూపేవరకు ఎవరి మాట వినేది లేదు.' ఇది కోటపల్లి మండలంలోని రాజారం గ్రామ పంచాయతీ ప్రజల మాట.

### గ్రామస్తులతో అధికారుల సమావేశం

పార్లమెంట్ ఎన్నికల బహిష్కరణకు గ్రామస్తులు సమష్టిగా నిర్ణయం తీసుకుని తీర్మానం చేయగా.. రెండో రోజైన గురువారం అధికార బృందం గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఎంపీడీవో ఆకుల భూమయ్య, ఎస్ఐ రాజేందర్, డీటీ నవీన్‌ల ఆధ్వర్యంలో అధికార బృందం గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. మీ సమస్యకు పరిష్కారం చూపుతామని, రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు అడ్డుగా ఉన్నాయని, ఎన్నికల అనంతరం ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని చెప్పినా గ్రామస్తులు మెట్టుదిగి రాలేదు. రోడ్డు లేక ఎన్నికష్టాలు పడుతున్నామో అనుభవిస్తున్న తమకి తెలుసని, ఓట్ల కోసం వచ్చి ఓట్లు వేసిన తర్వాత తమ మోహం కూడా చూడకుండా వెళ్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకేమి తెలుసని ప్రశ్నించారు. తమ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికే వరకు తమ తీర్మానాన్ని వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని గ్రామస్తులు స్పష్టం చేశారు. గ్రామస్తులకు అధికారుల బృందం ఎంత నచ్చచెప్పాలని చూసిన వారు ఒప్పుకోకపోవడంతో అధికార బృందం చేసేదేమి లేక వెనుతిరిగారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బద్రినాథ్ స్వామి, ఆర్ఐ రాజలింగు, పంచాయితీ కార్యదర్శి అజ్మీరా రమాదేవి పాల్గొన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి..



సమావేశంలో మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, ఏప్రిల్ 25 : లోక్‌సభ ఎన్నికలు సజావుగా సాగేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు తమ వంతు పాత్ర పోషించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో మంచిర్యాల ఆర్డీవో రాములు, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, ఎన్నికల తహసీల్దార్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, అసౌకర్యం కలుగకుండా తాగునీరు, నీడ, ఫ్యాన్‌లు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించామన్నారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియామాళిని కచ్చితంగా పాటించాలని కోరారు.

# స్పందన అంతంతే..

**ఆస్తిపన్నుపై ఐదు శాతం రిబేటుకు మరో ఐదు రోజులే గడువు**

మంచిర్యాల టౌన్, ఏప్రిల్ 25 : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను ఏప్రిల్ నెలలోనే చెల్లిస్తే ఐదు శాతం రిబేటును ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల మొదటివారంలో నిర్ణయం తీసుకుంది. ఈ విషయంపై అధికారులు ప్రజలకు సరైన ప్రచారాన్ని కల్పించకపోవడం, ప్రభుత్వం ఆస్తిపన్నుపై విధించే వడ్డీని మాఫీ చేస్తుండడం వంటి అంశాలతో ఈ ఐదు శాతం రిబేటుకు ప్రజల నుంచి స్పందన ఆశించినంత రావడం లేదు. మంచిర్యాల మున్సిపాలిటీలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 27,112 అసెస్‌మెంట్ల నుంచి మొత్తం రూ.16.47 కోట్లు ఆస్తిపన్ను రూపేణ వసూలు చేయాలి. ఏప్రిల్ ఒకటో తేదీన వచ్చిన రిబేటు స్కీంను ఇప్పటివరకు 3,200 మంది మాత్రమే ఉపయోగించుకున్నారు. వీరి నుంచి రూ.1.85 కోట్లు మాత్రమే ఆస్తిపన్ను వసూలు అయ్యింది. ఐదు శాతం రిబేటు స్కీం మరో ఐదు రోజుల్లో ముగియనుంది. ఐదు శాతం రిబేటు బూచీని చూపించి భవన యజమానుల నుంచి వచ్చినకాడికి ఆస్తిపన్నులను వసూలు చేయాలని మున్సిపల్ అధికారులు భావిస్తున్నా ఆచరణలో సాధ్య పడడం లేదు. వీలైనంత వరకు ఆస్తిపన్నును ఈ నెలలోనే వసూలు చేస్తే ఆర్థిక సంవత్సరం చివరలో పన్ను వసూళ్లకు ఇబ్బందులు పడాల్సిన అవసరం అంతగా ఉండదని, లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చుననే ఆలోచనలో ఉన్న అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆటోలను వార్డుల్లో తిప్పుతూ మైకుల ద్వారా ప్రచారాన్ని చేస్తున్నారు. లోకల్ కేబుల్ ఆపరేటర్ల ద్వారా ప్రచారాన్ని చేస్తున్నారు. మిగిలిన ఐదు రోజుల్లో వీలైనంత వరకు భవన యజమానులతో ఐదు శాతం రిబేటులో ఆస్తి పన్నును చెల్లించేలా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ అల్లె మారుతి ప్రసాద్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

**రెండు బైకులు ఢీ కొని ప్రమాదం**

బెజ్జూర్, ఏప్రిల్ 25 : మండలంలోని కొర్తెగూడ, పోతెపల్లి గ్రామాల మధ్య గురువారం రాత్రి రెండు బైకులు ఢీకొని జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. విషయం తెలుసుకున్న కౌటాల సీఐ సాదిక్ పాషా బెజ్జూర్ ఎస్ఐ విక్రమ్ వివరాలు సేకరించారు. పోలీసులు మరియు మృతుల బంధువులు తెలిపన వివరాల ప్రకారం బారెగూడ గ్రామానికి చెందిన తొర్రెం వెంగల్ రావు మరియు అర్కగూడ గ్రామానికి చెందిన ఆత్రం మహేశ్ పల్సర్ బైకు పై బారెగూడ నుంచి బూరుగూడకు ఫంక్షన్‌కు వెళ్తున్నారు. అదే విధంగా ఎల్కపల్లి గ్రామానికి చెందిన ఆయిల్ల నిఖిల్, శనిగారపు రాజ్ కుమార్ మరియు పోతెపల్లికి చెందిన దున్న నర్సింగ అనే ముగ్గురు ఒక బైకు పై ఎల్కపల్లి నుంచి పోతెపల్లికి ఫంక్షన్‌కు వెళు తున్నారు. కొర్తెగూడ–పోతెపల్లి గ్రామాల మధ్య వీరిద్దరి బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో తొర్రెం వెంగల్ రావు, ఆత్రం మహేశ్ మరియు దున్న నర్సింహ అనే ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

## విద్యార్థి ఆత్మహత్య

శ్రీరాంపూర్, ఏప్రిల్ 25 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే–6 గుడిసెలు సుభాష్‌నగర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి అరవింద్ పామర్(17) తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సంతోష్‌కుమార్ కథనం ప్రకారం.. బుధవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలు వెలువడగా.. అరవిందర్ ఎంపీసీ మ్యాథ్స్‌లో ఫెయిల్ అయ్యాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపాడు. తండ్రి రాజేందర్ మళ్లీ చదివి సప్లిమెంటరీ రాసి పాస్‌కా అని ధైర్యం చెప్పాడు. అయిప్పటికీ బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ చూడని సమయంలో ఇంటి వెనకాల రేకుల షెడ్డులో చున్నీతో ఉరివేసుకున్నారు. తండ్రి రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



అరవింద్ పామర్(ఫైల్)